RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 14.06.2024

సంపుటి : 1 | సంచిక 310 | పేజీలు : 4 | వెల : 5/-

## నటి హేమకు బెయిల్

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన నటి హేమకు స్థానిక కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది.ఆమె నుంచి డ్రగ్స్‌ను జప్తు చేసుకోలేదని, ఘటన జరిగిన పది రోజులకు వైద్య పరీక్షలు నిర్వహించారని హేమ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఆమె పార్టీలో పాల్గొన్నట్లు చూపే ఆధారాలను బెంగళూరు నేర నియంత్రణ దళం సీసీబీ, న్యాయవాది కోర్టుకు అందజేశారు. వాదనలను విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో

# ఈడి ఎంట్రీ..?

- 68 పేజీలతో ఛార్జ్ షీట్ దాఖలు..!
- 2 వేల కోట్ల అక్రమ నగదు రవాణ
- హైకోర్టు ఎంట్రీ తో కొత్త మలుపు..!
- భుజంగరావు,తిరుపతన్నకు దక్కని బెయిల్

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరుగుతుందా.? ఈ కేసు వివరాలను ఈడి అధికారులు ఎప్పటికప్పుడు ఆరాతిస్తున్నారా.? త్వరలో ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారిన అక్రమ నగదు లావాదేవీల మీద విచారణ కు ఈడి వచ్చే అవకాశం ఉ ందా.? అంటే అవుననే ప్రచారం జరుగుతుంది ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు మీద తెలంగాణ పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు దీంతో ఈడి రాక ఖాయం అనే వాదన మొదలైంది. తెలంగాణలోని గత రెండు అసెంబ్లీ ఎన్నికల బిఆర్ఎస్ అభ్యర్థులకు టాస్క్ ఫోర్స్ వాహనాల్లో డబ్బు సమకూర్చామని రాధా కిషన్ రావు ఆయన బృందంలోని అనేకమంది పోలీస్ అధికారులు విచారణలో కుండ బద్దలు కొట్టడంతో పాటు ఈ వందల కోట్ల అక్రమ నగదు లావాదేవీల విచారణ పేరుతో ఈడి ఎంటర్ అయ్యే అవకాశం ఉందన్న ప్రచారంతో గులాబీ నేతల్లో భయం మొదలైంది. నిజంగా ఈడీ రంగంలోకి దిగితే ఈ ట్యాపింగ్ వ్యవహారంలో నాడు బిఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన నేతలతో పాటు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన పెద్ద తలకాయలకు ఇబ్బందులు తప్పవనీ న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఛార్జ్ షీట్ దాఖలు:
ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు మీద తెలంగాణ పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు పోలీసులు మొత్తం ఆరుగురిని నిందితులుగా చేర్చగా వీరిలో ఎస్ఐబి మాజీ ఓఎస్డి ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు పరారులో ఉన్నట్లు, సస్పెండ్ అయిన అదనపు ఎస్పీలు భుజంగరావు తిరుపతన్న టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధా కిషన్ రావు సస్పెండ్ అయిన మాజీ డిఎస్పీ ప్రణీత్ రావు రిమాండ్ లో ఉన్నట్టు అందులో వివరించారు. 69 మంది సాక్షుల వాంగ్మూలాలను అభియోగపత్రంలో నమోదు చేశారు వీరిలో గతంలో ఎస్ఐబి టాస్క్ ఫోర్స్ లో పనిచేసిన పోలీస్ అధికారులు ప్రైవేట్ వ్యక్తులు

మిగతా వార్త 2లో

### కేసిఆర్‌కు నోటీసులు

–ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కేసులు

2లో

## లోకల్ బాడీ ఎన్నికల తర్వాతే కొత్త పీసీసీ

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు






తెలంగాణలో పీసీసీ పీఠం కాంగ్రెస్‌లో ఎడతెగని పంచాయితీలా మారేలా ఉంది. గతంలో సీఎం సీటుకు కూడా ఈ స్థాయిలో పోటీలేదని ఆ పార్టీ వర్గాలే అంటున్నాయి. అయితే అధిష్టానం మాత్రం రేవంత్ నాయకత్వంపై ఎలాంటి సందేహం లేకుండా పూర్తి నమ్మకం పెట్టుకుంది. అయితే ఈ సారి మాత్రం పీసీసీ పీఠం విషయంలో సీనియర్లంతా ఎవరికి వారే తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. బీసీ వర్గానికి చెందిన నేతనే ఈ సారి పీసీసీ పీఠంపై కూర్చోబెట్టాలని అధిష్టానం భావిస్తోంది. దీనితో భట్టి విక్రమార్క, మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీ తదితర నేతలంతా తమకే పీసీసీ దక్కాలని గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని సమాచారం. అయితే త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిని మారిస్తే తలనొప్పిగా మారొచ్చని అధిష్టానం భావిస్తోందని సమాచారం.ప్రస్తుత సీఎం పీసీసీగా ఉండి అసెంబ్లీలో కష్టపడి తెలంగాణను పవర్ లోకి తెచ్చారని హైకమాండ్ విశ్వసిస్తోంది. పైగా లోక్ సభలోనూ ఫలితాలు బాగానే వచ్చాయి. సీనియర్లందరినీ ఒక తాటిపైకి తేవడం, పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడం, అగ్రనేతల పర్యటనలను భారీ ఎత్తున చేసిన ఏర్పాట్లు, అధిష్టానానికి విధేయుడుగా ఉండటం ఇవన్నీ కలిపి హై కమాండ్ వద్ద రేవంత్ కు మంచి పేరే ఉంది. పైగా అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో జనాల మద్దతు పొందడంలో రేవంత్ క్రియాశీలక పాత్ర పోషించారని ఏఐసీసీ నమ్ముతోంది.స్థానిక ఎన్నికల తర్వాతే పీసీసీని మారిస్తే సరిపోతుందనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఎందుకంటే అందరూ సీనియర్లే కాబట్టి ఎవరికి ఇచ్చినా మిగిలినవారు గ్రూపులుగా విడిపోవచ్చు. ఆ ప్రభావం స్థానిక ఎన్నికలలో చూపించే ప్రమాదం లేకపోలేదు. స్థానిక ఎన్నికలలో కూడా కాంగ్రెస్ ఒకే అనిపించుకుంటే ఇక ఐదేళ్ల దాకా ఢోకా లేదని అధిష్టానం భావిస్తోంది. అందుకే స్థానిక ఎన్నికలు అయ్యేదాకా కొంతకాలం పీసీసీ అధ్యక్షుడిని కంటిన్యూ చేస్తే ఎలా ఉంటుంది? అనే అంశంపై పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి దాదాపు ఏడేళ్లు పనిచేశారని కొందరు నేతలు గుర్తు చేసుకుంటున్నారు. పార్టీని పవర్ లోకి తీసుకువచ్చిన రేవంత్ ను మరో టర్మ్ వరకు కొనసాగించే అవకాశం కూడా లేకపోలేదని ఇలాంటి సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉంటేనే మేలనే చర్చ కూడా పార్టీలో నడుస్తోంది.

## తిరుమలలో ప్రతి నిత్యం గోవింద నామ స్మరణ ప్రతి ధ్వనించాలి

- త్వరలో హైదరాబాద్ తరహాలో అమరావతి పునః నిర్మాణం
- 2047 నాటికి ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా తెలుగు ప్రజలు
- ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



"దేశం, రాష్ట్రంలోని ప్రజలందరు సిరిసంపదలతో ఆనందంగా జీవించాలని, ఆర్థిక అసమానతలను తొలగించి, త్వరలో "పేదరిక రహిత రాష్ట్ర స్థాపనకు శక్తిని" ప్రసాదించమని శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థించినట్లు ముఖ్యంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు."

తిరుమల – ప్రభాత సూర్యుడు

తిరుమలలోని శ్రీ గాయత్రీ నిలయం విశ్రాంతి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడుతూ, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్ర రాజ్యంగా ఆవిర్భవిస్తుందని, ఇందులో తెలుగువారిని నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు తనకు శక్తిని ప్రసాదించమని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. తాను ఈ ప్రాంత స్థానికుడు కావడంతో ప్రతి రోజు శ్రీవేంకటేశ్వర స్వామి స్మరణతోనే తనకు రోజు ప్రారంభమవుతుందన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, తన పాఠశాల, కళాశాల రోజుల్లో శ్రీనివాసమంగాపురం, తిరుపతికి నడిచి వెళ్లే సమయంలో తిరుమల శ్రీవారిని స్మరించుకున్నట్లు చెప్పారు. "శ్రీవేంకటేశ్వర స్వామి తమ కులదైవమని, గతంలో తనపై జరిగిన క్లైమోర్ మైన్ దాడి, గత ఐదేళ్లలో రాజకీయ దాడులతో సహా తన జీవితంలో ఎదుర్కొన్న అన్ని పోరాటాలు, సవాళ్లను శ్రీవారి ఆశీర్వాదం మరియు నా కుటుంబ సభ్యుల మద్దతుతో తాను ధైర్యంతో అధిగమించానన్నారు.

మిగతా వార్త 2లో

### సీఎంగా బాధ్యతల స్వీకరణ

వెలగపూడి–ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలగపూడిలోని సచివాలయంలో సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. ముందుగా నిర్ణయించిన

2లో

## రుణమాఫీకి నిధుల కేటాయింపుపై కసరత్తు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్యమంత్రిగా డిసెంబర్‌లోనే బాధ్యతలు చేపట్టినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి మార్చిలో మధ్యంతర బడ్జెట్‌నే ప్రతిపాదించారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, లోక్ సభ ఎన్నికల తర్వాత పరిస్థితుల్ని బట్టి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టాలనుకున్నారు. ఆ ప్రకారం ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు కూడా పూర్తయిపోవడంతో పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. 2024,-25 సంవత్సరానికి మొత్తం రూ.2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంట్ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు, మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా పేర్కొంది. ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వం రూ.53,196 కోట్లు ప్రతిపాదించింది. నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకుంది. జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టి అనుమతి తీసుకోవాల్సి ఉ ంది. ఉభయసభలు ఈ బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేయాల్సి ఉ ంది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఆగస్టు పదిహేనులోపు ఒకే విడతలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీకి రూ.30 వేల కోట్ల నుంచి రూ.35,000 కోట్ల వరకు అవసరం కానున్నాయి. ఆ మొత్తం నిధులు కేటాయించి బడ్జెట్ రూపొందించాల్సి ఉంది. నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో, ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఒక్క రుణమాఫీకే అంత మొత్తం కేటాయిస్తే ఇతర పథకాలపై ప్రభావం పడుతుంది. అందుకే ఇతర పథకాలపై ప్రభావం పడకుండా రుణమాఫీ చేయడంపై కసరత్తు చేస్తున్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే హామీల అమలుకు సమస్యలు ఉండవని రేవంత్ రెడ్డి భావిస్తూ వస్తున్నారు. అయితే అనుకున్నట్లుగా ఇండియా కూటమి అధికారంలోకి రాలేదు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు తప్ప కొత్తగా ఎలాంటి ఆదాయం ఉండదని స్పష్టమయింది. ఇప్పుడు అన్ని పథకాలతో పాటు రుణమాఫీకి నిధులు కేటాయించడం పెద్ద సవాల్‌గా మారనుంది. మద్యం ధరలు పెంచడం, భూముల విలువలు పెంచడం వంటి వాటిపై కసరత్తు చేస్తున్నారు. వీటి వల్ల ప్రజా వ్యతిరేకత వుందనే అంచనా ఉన్నా.. హామీల అమలుకు తప్పదని చెబుతున్నారు

### రైతు రుణమాఫీ అమలుపై విధివిధానాల ఖరారుకు మంత్రివర్గ సమావేశం

రాష్ట్రంలోని రైతులకు ఆగస్టు 15లోపు 2 లక్షల రుణమాఫీ అమలుపై విధివిధానాల ఖరారుకు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ నెల 15 లేదా 18న సమావేశం జరిగే అవకాశం ఉంది. రుణమాఫీ అమలుకు అవసరమైన ప్రభుత్వపరమైన నిర్ణయాలపై సమావేశంలో చర్చించి. వెల్లడించనున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిర్ణీత గడువులోగా రుణమాఫీని ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యాంశంగా చేపట్టారు. పంట పండించే ప్రతి పేద రైతుకు లబ్ధి చేకూరేలా రుణమాఫీ ద్వారా చేయూత అందించేలా, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతు కుటుంబాలను ఆదుకునేలా మార్గదర్శకాలు ఉండాలని భావిస్తున్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం గడువులోగా రుణమాఫీ చేసేందుకు సన్నాహాలు చేయాలని ఇటీవల వ్యవసాయ, ఆర్థిక శాఖాధికారులను సీఎం ఆదేశించారు. రుణమాఫీ అమలుకు ఎన్ని నిధులు అవసరం.. అందుబాటులో ఉన్న వనరులు, నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. రుణమాఫీ అమలుకు ఏ తేదీని

మిగతా వార్త 2లో

## మళ్లి నీట్ పరీక్ష..!

న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు





3లో

నీట్ యూజీ 2024 కౌన్సెలింగ్‌పై స్టే ఇవ్వబోమని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ నీట్ కౌన్సిలింగ్ నిలిపివేతకు గురువారం (జూన్ 13) నో చెప్పింది. 'కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మేము దానిని ఆపం. వారికి మళ్లీ ఎగ్జామ్ జరిగితే అంతా సజావుగా మారుతుంది. కాబట్టి భయపడాల్సిన పనిలేదని' సుప్రీం కోర్టు పేర్కొంది. నీట్ యూజీ పరీక్ష సమయంలో నష్టపోయిన సమయాన్ని భర్తీ చేయడానికి 'గ్రేస్ మార్కులు' పొందిన 1563 మంది అభ్యర్థుల ఫలితాలను సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎన్టీయే విచారణ సమయంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. గ్రేస్ మార్కులు పొందిన 1,563 నీట్ యూజీ అభ్యర్థుల స్కోర్‌కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయం తీసుకుందని, ఆ ప్రకారంగా ఈ విద్యార్థులకు గ్రేస్ మార్కులు తొలగిస్తామని

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# సీఎంగా చంద్రబాబు బాధ్యతల స్వీకరణ



వెలగపూడి – ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలగపూడిలోని సచివాలయంలో సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం జూన్ 13 సాయంత్రం 4.41 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్ లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సంబంధిత దస్త్రంపై సంతకం చేసి అధికారికంగా ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

# కేసీఆర్‌కు నోటీసులు

## –ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కేసులు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ నరసింహా రెడ్డి నేతృత్వంలోని కమిషన్ నోటీసులు పంపింది. ఆయన పదవీకాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో (పీపీఏ) ప్రమేయంపై వివరణ కోరుతూ నోటీసు జారీ చేసింది. జూన్ 15లోగా సమాధానం ఇవ్వాలని కమిషన్ సూచించింది. దీనిపై స్పందించిన కేసీఆర్ జులై 30 వరకు గడువు కావాలని కమిషన్ కి విజ్ఞప్తి చేశారు. కానీ సమయం ఇచ్చేందుకు కమిషన్ అంగీకరించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయగానే విద్యుత్ కొనుగోలు అంశంపై దృష్టి పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించింది. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశాలు ఇచ్చింది. అదులో భాగంగా జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ను ఏర్పాటు చేసింది. యాదాద్రి, దామరచర్ల విద్యుత్ ప్లాంట్లకు సంబంధించిన ఒప్పందాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పీపీఏలలో జరిగిన అవకతవకలపై జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ దర్యాప్తు చేస్తోంది. విచారణలో ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ప్రతిపాదన కూడా ఉంది. మాజీ సీఎం స్పందన సంతృప్తికరంగా లేకుంటే వ్యక్తిగత హాజరు ప్రక్రియను ప్రారంభిస్తామని కమిషన్ హెచ్చరించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పాటు భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టులకు సంబంధించి పీపీఏలో జరిగిన అవకతవకలను వెలికితీయాలని జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ దృష్టి సారించింది. మరో వైపు కాళేశ్వరపై విచారణ ఊపందుకుంది. ఈ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ పై అనేక ఆరోపణలను అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ చేశాయి. బీజేపీ సీబీఐ విచారణకు డిమాండ్ చేసింది. అయితే ఇందులో అవినీతిని తామే తేలుస్తామని కాళేశ్వరంపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను నియమించారు. నిర్మాణపరమైన అంశాలపై ఏజెన్సీలను పిలిచి విచారణ చేస్తున్నారు జస్టిస్ పీసీ ఘోష్. నిజాలు తెలుసుకునేందుకు అందరి వద్ద సమాచారం సేకరిస్తున్నట్టు ఘోష్ తెలిపారు. జూన్ 30వ తేదీలోపు విచారణ పూర్తి కాదని ఇంకా సమయం పడుతుందని చెప్పారు. అసలు విషయాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేమని అటున్నారు. టెక్నికల్ అంశాల విచారణ పూర్తి అయ్యాక, ఆర్థిక అంశాల పై విచారణ మొదలు అవుతుందని చెప్పారు. ప్రభుత్వం వద్ద నుంచి రిపోర్టులు అన్ని అందాయని అంటున్నారు. ఈ విషయంలోనూ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకు చేరుకుంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో రి మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చింది. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, పార్టీలో ఆయన సన్నిహితుల వ్యవహారాలను చక్కబెట్టేందుకే తామంతా కలిసి పనిచేశామని టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రణీత్‌కుమార్ అందించే వివరాలతో.. కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థులను, వారికి ఆర్థిక సాయం అందించేవారిని బెదిరించి లొంగదీసుకునేవారమని, సివిల్ తగాదాల్లో సెటిల్మెంట్లు చేసేవారమని, ఎన్నికల్లో వారి నగదు తరలింపును అడ్డుకునేవారమని చెప్పారు. బీఆర్ఎస్ డబ్బు రవాణాకు సహకరించేవారమని తెలిపారు. ఇప్పటికీ ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, ఓ టీవీ చానల్ అధినేత శ్రవణ్ రావులను ఇండియా రప్పించేందుకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేస్తున్నారు. నిన్నటి వరకూ ఎన్నికల కోడ్ ఉంది. ఇప్పుడు కోడ్ లేదు. పూర్తి పాలన రేవంత్ చేతుల్లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాజకీయం కూడా మారిపోయింది. బీఆర్ఎస్ పూర్తిగా వెనుకబడిపోయింది. ఒక్క ఎంపీ సీటు కూడా తెచ్చుకోలేకపోయింది. కవిత జైల్లో ఉన్నారు. ఇలాంటి సమయంలో కేసీఆర్ ను కూడా కేసులతో ఉక్కిరిబిక్కిరి చేస్తే.. ఇక పార్టీ కోలుకోవడానికి అవకాశం ఉండదన్న వ్యూహంతో కాంగ్రెస్ పార్టీ ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రాజకీయ విమర్శలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసుల్లో వెనక్కి తగ్గే అవకాశం ఉండదు. ఎందుకంటే పదేళ్ల పాటు ఆయన కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నెన్నో కేసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కేసీఆర్ ను ఆ స్థాయిలో టార్గెట్ చేయడానికి అన్ని ఆధారాలు ఉన్నప్పుడు ఎందుకు వదలాలనే ప్రశ్న వస్తుంది. అందుకే వచ్చే కొద్ది రోజుల్లో కేసీఆర్ మరిన్ని తీవ్రమైన విచారణలు ఎదుర్కోవాల్సి వచ్చేలా ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈడి ఎంట్రీ..?



మొదటి పేటి తరువాత

కూడా ఉన్నారు వేలాది పేజీల్లో అభియోగాలను బలపరిచే పత్రాలు పొందుపరిచారు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అంశాలు ఉండడంతో మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

మరోవైపు పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు మరో నిందితుని విచారించగా మరిన్ని ఆధారాలతో పూర్తి అభియోగపత్రం దాఖలు చేయనున్నట్లు తెలిపారు అయితే పోలీసులు ఛార్జ్ షీట్ దాఖలు చేయడంతో ఈ కేసులో ఈడి రాక ఖాయమని వార్తలు వినిపిస్తున్నాయి.

**రూపాయలు రెండు వేల కోట్ల రావాణ..**

ఈ కేసు విచారణలో నిందితులు చెప్పిన దానిని బట్టి 2018 ?2023 అసెంబ్లీ ఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థులకు టాస్కోఫర్స్ వాహనాల్లో ఎన్నికల నిధులు రవాణా అయ్యాయి ఈనాటి పరిస్థితులను బట్టి ఒక్క నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెడుతున్న ఖర్చు రూపాయలు 60 కోట్ల వరకు ఉంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే అందులో నాలుగో వంతు ప్రకారం లెక్కగట్టిన ఒక్క నియోజకవర్గంలో రూపాయలు 15 కోట్లు మొత్తాన్ని నిందితులు తమ వాహనాల్లో వీరు రవాణా చేసి ఉండే అవకాశం ఉంది. తెలంగాణలోని 119 స్థానల్లో తక్కువలో తక్కువగా 50 స్థానాల్లో అలా చేసిన ఒక ఎన్నికల్లో చేరవేసిన మొత్తం రూపాయలు 750 కోట్లు అయ్యి ఉంటుంది. ఈ లెక్కన రెండు అసెంబ్లీ ఎన్నికల కలిపి రూపాయలు 1500 కు పైగా మొత్తం అక్రమంగా రవాణా అయింది, అని భావించాలి దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు, ఉప ఎన్నికలతో కలిపి ఈ మొత్తం రూపాయలు రెండు వేల కోట్లకు చేరే అవకాశం ఉందానేది ఒక అంచనా మరి ఇంత పెద్ద మొత్తంలో నగదును సమకూర్చిందెవరు.? ఎక్కడి నుంచి ఈ వాహనాలు ఎక్కడికి ప్రయాణించాయి.? ఆ నగదు అందుకున్నది ఎవరు.? ఈ మొత్తం వ్యవహారాన్ని చక్కబెట్టింది ఎవరు.? అనే అంశాలపై ఈడి దర్యాప్తు చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే నాడు అధికార పార్టీకి పండింగ్ చేసినా వ్యాపారవేత్తలు మద్దతుదారులు విచారణకు సిద్ధం కావాల్సిందనేది నిపుణులు చెబుతున్నారు..

**హైకోర్టు ఎంట్రీ.**

మరో వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సాక్షాత్తు హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్ ఫోన్ ను ట్యాపింగ్ చేశారని ఫోన్ ఓ నిందితుడు ఇంటలిజెన్స్ అదనపు ఎస్పీ భుజంగరావు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి

ఈ నేపథ్యంలో హైకోర్టు సంచల నిర్ణయం తీసుకుంది పలు పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది సుమోటో పిటిషన్ పై చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాదే, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ టి. వినోద్ కుమార్ ల ధర్మసనం విచారణ చేపట్టనుంది అందులో కేంద్ర మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ తెలంగాణ డిజిపి హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఇంటలిజెంట్ ఆదనపు డీజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ను, ప్రతివాదులుగా పేర్కొన్నారు ఏకంగా న్యాయమూర్తుల ఫోన్లను ట్యాప్ చేశారనే విషయం బయటకు రావడంతో హైకోర్టు విచారణ కు దిగటంతో ఈ అంశంపై అన్ని ఆలోచించే విచారణకు దిగాలని ఈడి భావించే అవకాశాలు ఉన్నాయి.

**త్వరలో కీలక సాక్షులు రాక**

ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్ విదేశాలకు పరారు గాక వీరిని విలైనంత త్వరగా ఇక్కడికి తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో సిఐడి రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా ఈ కేసులో పోలీసులు సాధించిన పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

కీలక నిందితులను వీలున్నంత త్వరగా తీసుకొచ్చి వారిని విచారణ చేపడితే ఈ కేసులో ప్రధాన సూత్రధారులు పాత్రధారులు ఎవరన్నది స్పష్టంగా తేలనుంది..

**బదిలీల వేల ప్రత్యేక జాగ్రత్తలు..!**

తెలంగాణ వ్యాప్తంగా పలువురు పోలీస్ అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు చిన్న పెద్ద అధికారులు ఉన్నారు బదిలీల నేపథ్యంలో ఈ కేసు కు సంబంధించిన డాక్యుమెంట్లు ఇతర సాక్షాల తాలూకు ఆధారాలను కాపాడేందుకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

**నో బెయిల్.!**

ఫోన్ ట్యపింగ్ కేసులో నిందితులకు నాంపల్లి కోర్టులో చుక్కేదురైంది అడిషనల్ ఎస్పీ ఎస్పీలు భుజంగరావు తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు నాంపల్లి కోర్టు కొట్టివేసింది. రాజకీయ దురుదేశ్యంతోనే తమ క్లైంట్లను ను అరెస్టు చేశారని కేసులో సాక్షాదారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషన్ తరఫున న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జ్ షీట్ దాఖలు వేసినప్పటికీ వారిని ఇంకా విచారించాల్సి ఉందని పిపి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు నేపథ్యంలో ఈ పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయమూర్తి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

# తిరుమలలో ప్రతి నిత్యం గోవింద నామ స్మరణ ప్రతి ధ్వనించాలి

మొదటి పేజీ తరువాత..

గత ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి క్షీణించిందని, శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహంతో మనమందరం కలిసి పునఃరుద్ధరించాలన్నారు. ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని "తిరుమల పవిత్రతను కాపాడటం"తో ప్రారంభించాలనుకుంటున్నట్లు తెలిపారు. తిరుమలను ప్రతి హిందూ భక్తుడు తన జీవితకాలంలో తప్పక సందర్శించాల్సిన పుణ్యక్షేత్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

తిరుమలలో అనునిత్యం గోవింద నామ స్మరణ మాత్రమే ప్రతిధ్వనించాలని ఆ దిశగా తాను అడుగులు ముందుకు వేస్తారని తెలిపారు. ఈ లక్ష్యాలన్నింటిని సాధించడానికి తగినంత శక్తిని అనుగ్రహించమని తాను శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు పునరుద్ఘాటించారు.

# సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన తెలంగాణ మంత్రులు



అశ్వాపురం – ప్రభాత సూర్యుడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మవారి పల్లి సీతారామ ప్రాజెక్టు వ్యూ నుంచి పనులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు. వ్యూ పాయింట్ వద్ద సాగునీటి అధికారులు ఏర్పాటుచేసిన సీతారామ ప్రాజెక్ట్ ఫోటో ప్రజెంటేషన్ను తిలకించారు. ఇప్పటివరకు పూర్తయిన సీతారామ ప్రాజెక్టు పనుల వివరాలను డిప్యూటీ సీఎం, మంత్రులకు సాగునీటి పారుదల శాఖ అధికారులు వివరించారు. తరువాత మంత్రులు పంప్ హౌస్ పనులను పరిశీలించడానికి వ్యూ పాయింట్ నుంచి బయలుదేరారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పాఠ్య పుస్తకాల పంపిణీకి బ్రేక్



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ కొత్త గందరగోళానికి దారి తీసింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో ఆయా జిల్లాల్లో అధికారులు, ఉపాధ్యాయులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు వాటితో పాటు వర్క్ బుక్‌లను కూడా పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే పుస్తకాల్లో ప్రచురణకు సంబంధించి కొత్త వివాదం తలెత్తింది. పుస్తకాల్లోని మొదటి పేజీలో ఉండే ముందుమాట మార్చుకుండానే విద్యాశాఖ పుస్తకాలను ముద్రించినట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆ విషయం కాస్త వివాదాస్పదం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పుస్తకాల పంపిణీని నిలిపివేసి, ఇప్పటి వరకు పంపిణీ చేసిన పుస్తకాలను కూడా వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ ఆయా జిల్లాల డీఈవోలకు సమాచారం అందజేసింది.

# ఒక్క చుక్క నీరు ఇవ్వలేకపోయారు

## ప్రణాళికలు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం పని చేసింది

మంత్రులు భట్టీ, తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్



భద్రాద్రి కొత్తగూడెం – ప్రభాత సూర్యుడు

మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా చిరకాల వాంఛ. 2600కోట్లు తో పూర్తి అయ్యే ప్రాజెక్టు ను 20వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఒక చుక్క నీరు ఇవ్వలేకపోయారు. త్వరగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించాం. 52 కాలువ ను ఎన్ ఎస్ పి కెనాల్ ఎన్కూర్ కి అనుసంధానం. పంపులకు కనెక్షన్ ఇచ్చి ట్రైల్ రన్ స్టార్ట్ చేశాం. వైరా, సత్తుపల్లి కి అనుసంధానం చేసి రాజీవ్ సాగర్ కు కొనసాగుతుంది. ఆగష్టు 15లోపు పూర్తి చేయాలని క్యాలెండర్ ఫిక్స్ చేశామని అన్నారు.

తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 1997,98లో దుమ్ము గూడెంగా నామకరణం చేశాం. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్, ఇందిరా సాగర్ గా మార్చారు. ఆర్ఎస్ సీతారామ ప్రాజెక్టు గా మార్చింది. హెడ్ వర్క్స్ నుండి థర్డ్ పంపు వరకు వాడుకోవచ్చు. ఎక్కువ ఆయకట్టు వచ్చే లా మార్పులు చేస్తున్నాం. రెండు టన్నెల్ తో జూలూరుపాడు వరకు నిధులు మంజూరు చేయాలి. సత్తుపల్లి , వైరా లో రెండు టన్నెల్ పూర్తి చేయాలి. నా కోరిక పది లక్షల ఎకరాలు కు గోదావరి నీళ్ళు ఇవ్వాలని అన్నారు.

పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. అప్పు దొరుకుతుంది అని గత ప్రభుత్వం విచ్చలవిడిగా ఖర్చు పెట్టింది. ఒక్క ఎకరంకు నీరు ఇవ్వలేదు. గత ప్రభుత్వం చేసిన తప్పు లను సరిదిద్దడం ప్రభుత్వం ఆలోచన లేకుండా హెడ్ వర్క్స్ నుండి అక్కడ అక్కడ పనులు పూర్తి చేయ లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2600 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేయాలని భావించారు. ఆగష్టు 15 నాటికి వైరా నుండి దిగువన కు లక్షా 20 వేల ఎకరాలు కు నీరు ఇవ్వాలని నిర్ణయిం తీసుకున్నామని అన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 7న తెలంగాణ రాష్ట్రం కు ఇరిగేషన్ మంత్రి ని అయ్యా. గత ప్రభుత్వం అనాలోచితంగా... ప్రణాళికలు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం పని చేసింది. కాళేశ్వరం కు 97వేల కోట్లు ఖర్చు చేస్తే కొత్తగా అయుకట్టు లేదు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు వల్ల కూడా ఒక ఎకరం కు నీరు ఇవ్వలేదు. కొత్తగూడెం, పినపాక, భద్రాచలం కు అయుకట్టు పెంచే ఆలోచన చేస్తాం. ఈ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో.. ఎక్కువ ఆయకట్టు వచ్చే లా ప్రణాళికలు చేస్తాం. రాజీవ్ సాగర్ ప్రాజెక్టు ను సీతారామ ప్రాజెక్ట్ గా మార్చి 20 వేల కోట్ల కు వ్యయము పెంచిందని అన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

న్యూ ఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఢిల్లీ శాస్త్రి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.దేశంలో విద్యుత్ లేకుండా ఏ పనీ కాదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మోడీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామన్నారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, విద్యుత్ కోతలు లేకుండా ఉండాలంటే బొగ్గు ఉత్పత్తి పెంచాలన్నారు.మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నామని, రానున్న రోజుల్లో దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుదామని, ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు.



తెలంగాణ భవన్ బయట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి వందనం సమర్పించారు. ఆ తర్వాత.. అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లికూడా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్?తో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

303 సీట్లతో సొంతంగా మెజార్టీ ఉన్నప్పుడే..బీజేపీ సునాయాసంగా నిర్దేశిత లక్ష్యం 370 సీట్లు సాధించగలదన్న అంచనాలు వెలువడుతున్నప్పుడే?.మోదీ మరో కోణాన్ని ఆలోచించారు. అన్నీ ఉన్నాయన్న, వస్తాయన్న అతిశయానికి పోకుండా ఆచితూచి అడుగులు వేశారు. రాజకీయాల్లో మనం బలంగా ఉండడం ఎంత ముఖ్యమో?ప్రత్యర్థి బలహీనంగా ఉండడమూ, ఉంచడమూ అంతే ప్రధానమన్న సూత్రాన్ని ఒంటబట్టించుకుని వ్యూహాలు ఫలితంగా మూడోసారి దేశప్రధాని అయ్యారు. రచించారు. మూడో విడత ఢిల్లీ పీఠాన్ని అధిరోహించేక్రమంలో మోదీ ఒక్కో ఇటుకా పేర్చిన తీరు?..తలపండిన రాజకీయ విశ్లేషకుల అంచనాలను సైతం తలకిందులు చేసింది.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశానికి మూడోసారి ప్రధాని అవ్వడానికి ఏకైక కారణం మోదీనే. దేశ ప్రధానిగా సాధించిన విజయాలే కాదు?అంచనాలకు అందని రీతిలో ఆయన వేసిన రాజకీయ అడుగులే?..ఆయన సరికొత్త చరిత్ర సృష్టించడానికి కారణమయ్యాయి. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టింది మోదీనే. కానీ నెహ్రూ కాలంతో పోలిస్తే..ఇప్పటికి రాజకీయ వాతావరణం పూర్తి భిన్నం. నెహ్రూ, మోదీ సామాజిక నేపథ్యాలు, రాజకీయ అడుగులు కూడా భిన్నమైనవే. నెహ్రూ సంపన్న కుటుంబానికి చెందిన వారు.దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం ఘనత మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్‌ఖాతాలో పడింది. ప్రతిపక్షం బలహీనంగా ఉంది. గాంధీజీ మరణం తర్వాత నెహ్రూ భారత రాజకీయ ముఖచిత్రంగా మారారు. అప్పటికి దేశంలో పార్టీ అంటే కాంగ్రెస్సే?రాజకీయ నేత అంటే కాంగ్రెస్ నాయకుడే. అలా పరిస్థితులన్నీ పూర్తిసానుకూలంగా ఉన్నప్పుడు నెహ్రూ వరుసగా ప్రధానిగా ఉన్నారు.కానీ మోదీ అలా కాదు. ఆయన ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చారు. చాయ్‌వాలాగా గుర్తింపు పొందారు. కూటమిగా అయినా ప్రతిపక్షం బలంగానే ఉంది. సంకీర్ణ రాజకీయాల కాలం నడుస్తోంది. అనేక రాష్ట్రాల్లో జాతీయపార్టీలు నామమాత్రమై?ప్రాంతీయపార్టీల హవా పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ దేశప్రధానిగా మూడోసారి ఎన్నికవ్వడం భారతదేశ చరిత్రలోనే కాదు..ఆధునిక ప్రపంచంలోనూ అతిపెద్ద విప్లవం.బీజేపీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని హెచ్చరిస్తూ కాంగ్రెస్ సహా ఇతర పక్షాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. రిజర్వేషన్ల అమలుపై ఎన్నడూ లేనిస్థాయిలో చర్చ జరిగింది. అసలు మోదీ మరోసారి ప్రధాని అయితే..దేశంలో జరిగే చివరి ఎన్నికలు ఇవేననీ ప్రతిపక్షాలు జోస్యం చెప్పాయి.మరి ఇలాంటి విపరీత ప్రచారాన్ని సైతం దాటుకుని కొన్ని రాష్ట్రాలను బీజేపీ క్లీన్‌స్వీప్ ఎలా చేయగలిగింది..? జాతీయ స్థాయిలో వరుసగా రెండు సార్లు అధికారంలో ఉండి కూడా..కరోనా కల్లోలాన్ని తట్టుకుని కూడా బీజేపీ 240 సీట్లు ఎలా సాధించగలిగింది..? మోదీ గ్యారెంటీపై ప్రజలకు నమ్మకం కలగడానికి కారణమేంటి..? మోదీని ఇండియా ముఖచిత్రంగా ప్రపంచదేశాలు ఎందుకు చూస్తున్నాయి..?పదేళ్లు (2004-2014 మధ్య) అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమిపై అవినీతి, శాంతిభద్రతల నిర్వీర్యం వంటి ఆరోపణలతో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఆ భారీ వ్యతిరేకత తర్వాత అధికారంలోకి రావడం, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ ఉండడంతో 2014-2019 మధ్య మోదీ ప్రభుత్వ పాలన నల్లేరు మీద నడకలా సాగిపోయింది. 2019-2024 మధ్య మాత్రం భారీ మెజార్టీ ఉన్నప్పటికీ ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి.ఆర్టికల్ 370 ఎత్తివేత, ట్రిబుల్ తలాక్ రద్దు వంటివి సాఫీగానే సాగినా?వ్యవసాయ చట్టాల అమలు, అంం, కామన్ సివిల్ కోడ్ వంటి అమలు అనుకున్నంత తేలిగ్గా సాధ్యం కాలేదు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. అంం అమలును వాయిదా వేయాల్సివచ్చింది. కామన్ సివిల్ కోడ్ ఎన్నికలముందు మాత్రమే తెరపైకి వచ్చింది. వీటన్నింటికి తోడు కరోనా రూపంలో అసలైన సవాల్ ఎదురయింది. సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాల్సివచ్చింది.కరోనాతో ఆర్థికాభివృద్ధిపై పెను ప్రభావం పడింది. ధరలు అదుపుతప్పాయి. రష్యా, యుక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ పరిణామాలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపాయి. అయితే ఈ సవాళ్లన్నింటినీ ప్రధాని మోదీ చాకచక్యంగా అధిగమించారు. సమయానుకూల నిర్ణయాలతో దేశం సంక్షోభం బారినపడకుండా నివారించారు. పొరుగుదేశాలు శ్రీలంక, పాకిస్థాన్‌కు ఎదురయిన దుస్థితి భారత్‌కు రాకుండా అడ్డుకున్నారు. మొదటిదఫాలో చేపట్టిన మేకిన్ ఇండియా వంటి ఫలితాలు ప్రభావం చూపాయి.మరోపక్క విదేశాంగవిధానంతో అంతర్జాతీయంగా భారత్‌ను బలీయంగా మార్చారు. పాకిస్థాన్ సైతం భారత్‌ను ప్రశంసించేస్థితిలోకి తీసుకెళ్లారు. సంస్కరణలున వేగవంతం చేసి సంపద సృష్టించారు. విశాలమైన రహదారుల నిర్మాణం, వందేభారత్ రైళ్లు, డిజిటల్ లావాదేవీలు, పారిశ్రామకరంగాలకు ప్రోత్సాహం వంటివాటితో ప్రజల జీవనవిధానంపై ప్రభావం చూపారు. ఫలితంగా కొత్త ఇండియా ఆవిర్భావానికి బాటలు వేశారు.అయితే పదేళ్లు వరుసగా అధికారంలో ఉండడంతో పాటు మతానికి ప్రాధాన్యత పెరిగిందన్న ఆరోపణలు, సంపద అందరికీ సమానంగా పంపిణీ కావడం లేదన్న విమర్శలు, ధరల పెరుగుదల, ప్రభుత్వరంగంలో ఉద్యోగాల కొరత, రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడ్డ ప్రభుత్వాల్లో జోక్యం చేసుకోవడం, అదేపనిగా జరిగిన సీబీఐ, ఐటీ దాడులు వంటివి ..బీజేపీపై ఊహించిన దానికన్నా వ్యతిరేకతను పెంచాయి.అవినీతి ఆరోపణలు ఉన్నవారిని పార్టీలో చేర్చుకోవడం, పాలన ఒకే చోట కేంద్రీకృతమయిందన్న భావన వంటివి విమర్శకులకు పని కల్పించాయి. సొంతంగా 370 సీట్లు సాధించడమే లక్ష్యమని ఎన్నికల కురుక్షేత్రంలో దిగినప్పటికీ.. ఈ పరిస్థితులన్నింటినీ గమనించిన ప్రధాని మోదీ పొత్తుల విషయంలో ఎవరికీ అందని ఎత్తులు వేశారు. ఆయన వ్యూహాలతో ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా ఎన్డీఏ కూటమిని బలపడడంతో పాటు ఇండియా కూటమి బలహీనపడి?మూడోసారి మోదీ దేశప్రధాని అయ్యేందుకు మార్గాన్ని సుగమం చేసింది.యూపీఏ కూటమి ఇండియాగా పేరు మార్చుకుని? అనేక పార్టీలను కలుపుకుపోయింది. ఆ కూటమి ఏర్పాటయినప్పుడు..బలంగానే కనిపించింది. అయితే ఇండియా కూటమికి, ఎన్డీయే కూటమికి ఒకే ఒక తేడా ప్రధానిమోదీ. ఆ ఒక్క తేడానే బీజేపీని మరోసారి ఢిల్లీ పీఠంపై కూర్చోబెట్టింది. ఇండియా కూటమి గెలిస్తే..దేశ ప్రధాని ఎవరో ఎవరికీ తెలియదు. చెప్పే ధైర్యం కూడా కూటమిలోని పార్టీలకు లేదు. ఇంకా చెప్పాలంటే..ఇండియా కూటమిలో ఉన్న ప్రతి పార్టీ అధినేతా ప్రధాని అభ్యర్థి రేసులో ఉన్నవారే. అలాగే ఇండియా కూటమిలో ఎందరున్నా ఆ కూటమి ముఖచిత్రంగా కనిపించేది కాంగ్రెస్సే.కానీ కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషిస్తే..ఒప్పుకోవడానికి కూటమిలోని ఏ పార్టీ సిద్ధంగా లేని విచిత్ర పరిస్థితి. రాహుల్ గాంధీ కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నప్పటికీ..ఆయనను ప్రధాని అభ్యర్థిగా హస్తం పార్టీ బయటకు చెప్పలేకపోయింది. ఇక మిగిలిన పక్షాల నోటివెంట రాహుల్ మాటే రాలేదు. అదే సమయంలో బీజేపీ ప్రధాని అభ్యర్థి మోదీనే అని అందరికీ తెలుసు. మోదీ అభ్యర్థిత్వంపై ఎన్డీఏలోని పక్షాలన్నింటికీ ఏకాభిప్రాయం ఉంది. అసలు తనను తాను గ్యారెంటీగా చూపి..మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ తేడా ఎన్నికల ఫలితాలపై సుస్పష్ట ప్రభావం చూపింది. అనేక రాష్ట్రాల్లో బీజేపీకి భారీగా సీట్లు కట్టబెట్టింది.బీజేపీలో, ఎన్డీఏలో ఎంతమంది నేతలున్నా?ప్రధాని మోదీనే ఆ పార్టీకి, కూటమికి స్టార్‌క్యాంపెయినర్..వికసిత భారత్ తన లక్ష్యమని, 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్‌గా తీర్చిదిద్దుతానని ప్రధాని ఎన్నికల ప్రచారంలో పదే పదే ప్రకటించారు. పదేళ్లలో భారత్ సాధించినవాటన్నింటిపైనా ప్రచారం జరిపారు. ఇండియా..న్యూ ఇండియాగా ఎలా రూపాంతరం చెందిందో పూసగుచ్చినట్టు వివరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే? ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం, సోలార్ వ్యవస్థ, ం వంటివాటిలో భారత్ ముద్ర ఎలా ఉండబోతోందో చెప్పారు.భారత్‌ను పదేళ్లకాలంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎలా మార్చామో..ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రానున్న రోజుల్లో ఎలా మారుస్తామో వెల్లడించారు. 2014కు ముందు-తర్వాత కాలాన్ని పోలుస్తూ ప్రసంగాల జరిపారు. విదేశాంగవిధానం గురించీ, భారత్ వ్యతిరేక శక్తులను మట్టుబెట్టడం గురించీ మాట్లాడారు. విమర్శలు వచ్చినప్పటికీ హిందూముస్లిం రాజకీయాల గురించీ మాట్లాడారు. మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమని తేల్చిచెప్పారు.ఉన్నది ఉన్నట్టుగా.. చేసింది చేసినట్టుగా.. లక్ష్యాలను అర్థమయ్యేలా ప్రధాని వివరించిన తీరు ప్రజల్లోకి బాగా వెళ్లింది. బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే..రాజ్యాంగాన్ని మారుస్తారని..ఇవే చివరి ఎన్నికలవుతాయని, రిజర్వేషన్లు ఉండబోవని కాంగ్రెస్ చేసిన వ్యతిరేక ప్రచారం కన్నా?.ప్రధాని మోదీ తన పాలన గురించి తాను చెప్పుకున్న సానుకూల ప్రచారం ఓటర్లపై ప్రభావం చూపింది. భవిష్యత్తుకు మోదీ గ్యారెంటీ అన్న నినాదం ఎక్కువమందికి నమ్మకం కలిగించింది. ఫలితంగా నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టి.. సరికొత్త సృష్టించారు మోదీ.

## రుణమాఫీకి నిధుల కేటాయింపుపై కసరత్తు

మొదటి పేజీ తరువాత..



కటాఫ్‌గా తీసుకోవాలి. అర్హులైన రైతుల గుర్తింపునకు విధివిధానాలు ఎలా ఉండాలనే అంశంపై కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్రంలో గతంలో రుణమాఫీ అమలైన తీరును పరిశీలించటంతో పాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీ పథకాలు, కేంద్రం ఇప్పటికే అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలకు అనుసరించిన పద్ధతులను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. వాటి వల్ల ప్రయోజనాలు, నిర్దేశించిన అర్హతలను కూడా పరిశీలిస్తున్నారు.

**కిసాన్ సమ్మాన్ నిధి అమలు తీరుపైనా దృష్టి**

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా దేశంలో అర్హులైన రైతులందరికీ ఏటా 6 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జడ్పీ ఛైర్‌పర్సన్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించేవారిని ఈ పథకం నుంచి మినహాయించింది. రాష్ట్రంలో రుణమాఫీ అమలుకు అటువంటి ప్రత్యేక మార్గదర్శకాలు పాటించాలా.? తద్వారా అసలైన రైతులకు మేలు జరుగుతుందా.? ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి రైతుకు మేలు జరగాలంటే ఎలాంటి విధివిధానాలుండాలి.? అన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం విశ్లేషణ చేస్తోంది. వీటన్నింటిపైనా వచ్చే వారం జరిగే మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి. నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## రాష్ట్రంలో బ్లడ్ బ్యాంకుల బలోపేతం

### ఐపిఎం సేవలను ఆధునికరణ

### రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి దామోదర్ రాజనర్సింహా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో బ్లడ్ బ్యాంకులను బలోపేతం చేస్తు ఐపిఎం సేవలను ఆధునికరిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లోని తన కార్యాలయంలో రాష్ట్రంలో బ్లడ్ బ్యాంకుల పనితీరు ,నిర్వహణ, బలోపేతంపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెరుగైన పనితీరును కలిగిన 14 బ్లడ్ బ్యాంకులను చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం (జూన్ - 14) ను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న బ్లడ్ బ్యాంకులు రక్త నిల్వలను పెంచుకోవాలని, అన్ని జిల్లా కేంద్రాలలో బ్లడ్ డొనేషన్ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెరుగైన పనితీరును కలిగిన 14 బ్లడ్ బ్యాంకులను చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు అదేసహించారు.సమీక్షలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బ్లడ్ బ్యాంకుల (63) పనితీరు, నిర్వాహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూన్ 14 న జరిగే ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలలో రక్తదాన ఆవశ్యకతపై అవగాహన సదస్సులను నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను కోరారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్త నిల్వలను పెంచుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీ ఎ కర్ణన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, ఐపీఎమ్ డైరెక్టర్ డాక్టర్ శివ లీల, మెడికల్ అండ్ హెల్త్ అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్ లు పాల్గొన్నారు.

## మళ్లీ నీట్ పరీక్ష..!




మొదటి పేజీ తరువాత..

సుప్రీంకోర్టు కి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. వీరికి మరోసారి పరీక్ష రాసే అవకాశం కూడా కల్పిస్తామని వెల్లడించింది. జూన్ 23న పరీక్షలు నిర్వహించి, జూన్ 30లోపు ఫలితాలు ప్రకటిస్తామని ఎన్టీయే అత్యున్నత ధర్మాసనానికి తెలిపింది.కాగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పేపర్ లీక్ ఆరోపణలతో పాటు ఫలితాల వివాదం తీవ్ర దుమారం రేపుతోంది. నీట్ ఎగ్జామ్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ పరీక్షను రద్దు చేయడం అంత సులువు కాదని స్పష్టం చేసింది. క్యాన్సిల్ చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటుందని, అలాగే కౌన్సెలింగ్ ప్రక్రియపై స్టేకు కూడా సుప్రీంకోర్టు నిరాకరించింది. పరీక్షపై వస్తున్న ఆరోపణలకు సమాధానాలు కావాలని ఎన్టీయేను ధర్మాసనం ఆదేశించింది. ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలపై వివరణ ఇవ్వాలంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔం)కి నోటీసులు జారీ చేసింది.మే 5న నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష జరిగింది. అయితే మొదట జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పిన అధికారులు.. అంతకంటే ముందే జూన్ 4న రిజల్ట్ విడుదల అయ్యాయి. నీట్ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది. దీంతో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో కేంద్రం నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది.నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై దాఖలైన పిటిషన్లపై జూన్ 13న విచారణ జరిపిన సుప్రీంకోర్టు వెబ్‌కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని స్పష్టం చేసింది . ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఔం)కి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 6 నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభంకానుంది. జూన్ 12న ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టులోనూ విచారణ జరిగింది. ఢిల్లీ హైకోర్టు కూడా కౌన్సెలింగ్‌పై స్టేను నిరాకరిస్తూ..తదుపరి విచారణనకు జులై 5కి వాయిదావేసిన సంగతి తెలిసిందే.


**ఆరుగురు టాపర్ల వివాదమే కారణం..**

ఈ ఏడాది మే 5న దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ -2024 పరీక్షకు దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. నీట్ యూజీ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జూన్ 4న వెల్లడించింది. ఫలితాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఏకంగా 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. అందులోనూ హర్యానాలో ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఒకేసారి ఒకే కేంద్రం నుంచి ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే ఫిజిక్స్ వాలా విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండే దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విద్యార్థులకు ర్యాండమ్‌గా 70 నుంచి 80 మార్కులు కలిపారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పాండే పిటిషన్‌తో పాటు మరో రెండు పిటిషన్లపై జూన్ 13న విచారణ సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

**పేపర్ లీకైనట్లు కాదు - ఎన్టీఏ డీజీ**

నీట్ యూజీ 2024 ప్రవేశ పరీక్షలో 63 అవకతవకలకు పాల్పడినట్లు తేలిందని ఎన్‌టీఏ డీజీ సుబోధ్ సింగ్ తెలిపారు. వారిలో 23 మందిని పరీక్ష సమయంలోనే డిబార్ చేశామన్నారు. మిగిలిన 40 మంది విద్యార్థుల ఫలితాలను హోల్డ్‌లో ఉంచామని ఆయన తెలిపారు. కేవలం కొంతమంది అవకతవకలకు పాల్పడినంత మాత్రానా పరీక్ష పేపర్ లీక్ అయినట్లు కాదని ఆయన స్పష్టంచేశారు. ఇలాంటి ఆరోపణల వల్ల నీట్ పరీక్ష విశ్వసనీయత ఏమాత్రం దెబ్బతినదని సుబోధ్‌సింగ్ అన్నారు.

## అన్నా క్యాంటిన్లు పునః ప్రారంభం




అనంతపురం - ప్రభాత సూర్యుడు

ఏపీ లోని పేదలకు కేవలం ఐదు రూపాయలకే పట్టెడన్నం పెట్టడానికి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరుతో దాదాపు 368 అన్నా క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే 2019 లో వైసీపీ ప్రభుత్వం రాగానే అవన్నీ మూతపడ్డాయి.- ఆ తర్వాత పలు ప్రాంతాల్లో టిడిపి నాయకులు స్వయంగా అన్న క్యాంటీన్లు ప్రారంభించిన కూడా వైసిపి ప్రభుత్వం వాటిని కూలదోసింది... అనంతపురం జిల్లా కేంద్రంలో అన్నా క్యాంటిన్లు అపరిశుభ్రంగా, తాగుబోతులకు నిలయంగా ఉన్నాయి, అయితే పేదలు మాత్రం ఈ క్యాంటిన్లు పునః ప్రారంభం పై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

### హరీశ్ రావు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ద్వారా 25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇప్పుడు కేవలం 11 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మనఊరు-మనబడి కార్యక్రమాన్ని కొనసాగించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. స్కూళ్లలో పారిశుధ్య సిబ్బందిని నియమించాలని, బడులకు ఫ్రీ కరెంటు ఇవ్వాలని కోరారు.

## అమ్మవారి సేవలో సీఎం చంద్రబాబు

తిరుపతి - ప్రభాత సూర్యుడు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యేలు పులివర్తినాని, ఆరని శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, సివిఎస్వో నరసింహ కిషోర్, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా అమ్మవారి ధ్వజస్తంభం వద్ద మొక్కులు తీర్చుకున్న ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం చంద్రబాబు, లోకేష్ దంపతులకు ఆశీర్వాద మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి వస్త్రం, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com


# అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ ప్రమాణస్వీకారం



ఇటానగర్ – ప్రభాత సూర్యుడు

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగడం వరుసగా ఇది మూడోసారి. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రిగా బిజెపికి చెందిన చౌనా మే కూడా ప్రమాణస్వీకారం చేశారు.అరుణాచల్ ప్రదేశ్ కెటి పర్నాయక్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. పెమా ఖండూతో పాటు మరో 11 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఖండూ సహా మరో పది మంది క్యాబినెట్ మంత్రులు ? బియురామ్ వాహ్గే, న్యాటో దుకామ్, గాబ్రియేల్ డెన్వాంగ్ వాంగ్సు, వాంగ్కి లోవాంగ్, పసాంగ్ దోర్జీ సోనా, మామా నటుంగ్, దాసంగ్లు పుల్, బలో రాజా, కెంటో జిని మరియు ఓజింగ్ టేసింగ్ ఉన్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జెపి.నడ్డా, కిరణ్ రిజిజు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# వానలపైనే జలశయాల ఆశలు



కరీంనగర్ – ప్రభాత సూర్యుడు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జలాశయాల్లో నీళ్ళు అడుగంటాయి. డెడ్ స్టోరేజ్ కి నీటి మట్టం పడిపోవడంతో ఆందోళనకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. నానాటికీ పడిపోతున్న నీటి మట్టం సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలను కలవరపరుస్తోంది. ఆరుగాలం శ్రమకు సై అంటున్న రైతుల మదిలో దిగాలును పెంచుతోంది.సకాలంలో కురిసే వర్షాలపై గంపెడాశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి కర్షకుల్లో కనిపిస్తోంది. గతేడాది ఆది నుంచే వర్షాల జోరుతో నీళ్ల సమృద్ధిగా కనిపించాయి. ఈ ఏడాది అలాంటి పరిస్థితి ఉ ండకుంటే సాగుకు, తాగుకు ఇబ్బంది ఎదురుకానుంది. ఇటీవల తొలకరి జల్లుల జాడలు కనిపించినా అనుకున్న విధంగా వర్షపాతం నాలుగు జిల్లాల పరిధిలో నమోదుకాలేదు. జూన్, జులై మాసంలో పడే వర్షాల ఆధారంగానే పంటల సాగుకు మేలు జరగనుంది. జిల్లాలోని పెద్దనీటి వనరుల మీదనే చెరువులు, కుంటల కింద ఆయకట్టు ఆధారపడి ఉంది. ప్రధాన జలాశయాల ప్రస్తుత పరిస్థితి తీరు ఇలా ఉంది.కరీంనగర్ తలాపున ఉన్న లోయర్ మానేరు డ్యామ్ ద్వారా కరీంనగర్, సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటితో పాటు ఉ మ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో దాదాపు 6.80 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుంది. ఈసారి మండు వేసవిలో ఎలాగోలా దాహార్తి కష్టాలు రాకుండా ఉన్న నీటిని సక్రమంగానే వినియోగించారు. ఇప్పుడున్న అసలు సమస్యల్లా ఈ జలాశయం కింద ఉన్న చెరువులు, కుంటల్లో అనుకున్న విధంగా నీళ్ల లేకపోవడంతో వాటి కింద సాగు చేసిన ఆయకట్టు పంటలకు ఇబ్బంది కలుగనుంది.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 3 టీఎంసీల నీళ్ల తక్కువగా ఉన్నాయి. ఈ నెలలో భారీ వానలు పడకుంటే కరీంనగర్ గడ్డ పరిస్థితి ఎదుర్కునే పరిస్థితి నెలకొంది. ఎల్ఎండీ నీటి నిల్వ సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.82 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఈ సమయానికి 8.18 టీఎంసీల నీరు ఉంది. 12 టీఎంసీల నీరు డ్యామ్ లో ఉంటేనే కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీటి సప్లై కి ఇబ్బంది లేకుండా ఉంటుందని కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ వై.సునీల్ రావు తెలిపారు. డెడ్ స్టోరేజ్ నుంచి ప్రస్తుతం బూస్టర్ ల ద్వారా కరీంనగర్ కు మంచినీటి సప్లై చేస్తున్నామని స్పష్టం చేశారు.మధ్యమానేరు(శ్రీరాజరాజేశ్వర) జలాశయం కళ తప్పి రూపును కోల్పోయింది. గతేడాది ఎటు చూసినా నీటిసంద్రమనే పందాలో కనిపించినా మిడ్ మానేర్ జలాశయంలో ఇప్పుడు ఆ ఆనవాళ్లు లేవు. కి.మీ పరిధిలో తగ్గిపోయాయి. 2023లో ఇదే సమయానికి 20 టీఎంసీలతో కళకళలాడిన మధ్య మానేర్ జలాశయంలో ఇప్పుడు 5 టీఎంసీలకు పైగా నీళ్లున్నాయంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. దాదాపు 15 టీఎంసీలు తగ్గిపోయాయి.ఈ జలాశయం కింద సాగవ్వాల్సిన పంటల విషయంలో రైతులు ఆచితూచి సాగుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు పడి నీళ్లు నిండిన తరువాతనే పంటలు వేద్దామనే ధోరణితో ఉన్నారు. పైగా ఇక్కడి నుంచి అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాలకు నీళ్లు అందించాల్సి ఉంది. కానీ మిడ్ మానేర్ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తుంది.జిల్లాలకు సాగు, తాగునీటిని అందించే శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలో నిల్వలు తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ముఖ్యంగా ఇక్కడి నుంచే హైదరాబాద్ కు తాగునీటి సరఫరా జరుగుతోంది. దీనికింద చాలా చిన్న నీటి వనరులు ఆధారపడి ఉ న్నాయి.నారాయణపూర్ చెరువుతోపాటు ఇక్కడి జలాశయం వెనుక భాగంలో నిలిచే నీటితో అంతర్గాం, ఎండపల్లి, ధర్మారం, పెగడపల్లి, వెల్గటూర్, ధర్మపురి మండలాల్లోని రైతాంగానికి మేలు జరగనుంది. ఇక్కడ కూడా గతేడాదితో పోలిస్తే నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. కేవలం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో సాగుకు, తాగుకు ఎంతమేర ఇక్కడి జలం అందుతుందనేది అధికారులకే అర్థం కావడం లేదు.కిందటి ఏడాదితో పోలిస్తే 7 టీఎంసీలు తగ్గాయి. రోజు రోజుకు జలాశయాల్లో తగ్గుతున్న నీటిమట్టం చూస్తే నీటి కష్టాలు తప్పాలంటే వరుణుడి కరుణ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వైద్య పరీక్షలకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణలో పెద్దలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం అవుతోంది. పెరుగుతున్న జీవనశైలి వ్యాధులను అరికట్టేలా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ కోసం 10 మొబైల్ ల్యాబ్స్ సిద్ధం చేసినట్లు చెప్పారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం)లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టనుండగా.. కేంద్రం నుంచి 60 శాతం నిధులు సమకూరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చనుంది. గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు ముందస్తు పరీక్షలు నిర్వహించడం ద్వారా సకాలంలో చికిత్స అందించే వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు.అధ్యయనాల ప్రకారం తెలంగాణలో గత 20 ఏళ్లలో హృద్రోగాలు, క్యాన్సర్, మధుమేహం, బీపీ వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నట్లు తేలింది. దాదాపు 60 శాతం వ్యాధులు ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్స్ వల్లే వస్తున్నాయని అంచనా వేస్తున్నారు. అయితే, రొమ్ము క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధుల విషయంలో ఒక శాతంలోపే మహిళలు ముందస్తు పరీక్షలు చేయించుకుంటున్నారని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది వంద శాతం వరకూ ఉంటోంది. ప్రజలందరికీ ముందస్తు పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆయా వ్యాధులను నిర్ధారించి సకాలంలో వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఊరూరా తిరుగుతూ 26 – 70 ఏళ్ల వయసున్న అందరికీ డిజిటల్ మయోగ్రామ్, పాప్స్మెర్, ఈసీజీ, ఈ2డీ ఏకో సహా ఇతర అన్ని బ్లడ్ టెస్టులు నిర్వహిస్తారు. దీనికి అనుగుణంగా ఏర్పాటు చేసిన మొబైల్ ల్యాబ్స్లో వైద్యులతో పాటు నర్సులు, ఇతర టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారు. ప్రధానంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. పురుషుల్లో నోటి క్యాన్సర్తో పాటు షుగర్, బీపీ, గుండె వ్యాధులపై పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి హైదరాబాద్ ఎంఎన్జే ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రికి తరలిస్తారు. అక్కడ బయాప్సీ వంటి తదుపరి పరీక్షలతో వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. ఒకవేళ షుగర్, బీపీ వంటి సమస్యలుంటే బాధితులకు ఉచితంగా మందులు అందిస్తారు. వారి వారి గ్రామాలకు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వారిని అనుసంధానం చేసి అక్కడి నుంచి ప్రతి నెలా మెడిసిన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టనున్నారు. ఒకవేళ బాధితులు ఎవరైనా ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉంటే వారి ఇళ్ల వద్దకే ఆరోగ్య సిబ్బంది మందులు సరఫరా చేసేలా చూస్తారు.

# పేదలకు అండగా నిలబడేది సిపిఐ పార్టీనే

## సిపిఐ జాతీయ నాయకులు, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్ రెడ్డి





అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు

ప్రతి పేదవాడి అండగా సిపిఐ పార్టీ మాత్రమే నిలబడుతుందని మాజీ శాసనసభ్యులు, సిపిఐ నాయకులు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావి నారాయణ రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో నైజాం సర్కార్ కు వ్యతిరేకంగా, భూస్వామ్య దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ స్వరాష్ట్ర తొలిదశ పోరాటానికి నాంది పలికిన సిపిఐ పార్టీ హైదరాబాదు నగర శివారు మొత్తంలో వేలాది మందికి ఇండ్ల స్థలాల పోరాటం చేసి ఆసరాగా నిలిచిన ఘనమైన చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని, అధికారం ఉన్నా లేకున్నా నిరంతర ప్రజలకు సంక్షేమం కోసం ఉద్యమాలు చేస్తామని సగర్వంగా చెబుతున్న పార్టీ సిపిఐ అని మాజీ శాసనసభ్యులు సిబిఐ జాతీయ సమితి నాయకులు కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. అనంతరం ఆర్కే నగర్ లో ఏర్పాటు చేసిన సిపిఐ ప్రజా బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు, దేశ రాజకీయాలు ప్రమాదంలో ఉన్నాయని ప్రజాస్వామ్యంలో ఓటును డబ్బు మద్యం లిక్కర్ మాఫియాతో పాటుగా మతం అనే మా ద్యం శాసిస్తున్నాయని, అత్యంత భయంకరమైన ఆయుధం గా మతాన్ని వాడుకుంటున్న బీజేపీ పాలన చాలా రోజులు నిలవదని అన్నారు,10 ఏళ్లుగా దేశానికి ఏమి చేయలేని మోడీ, అనుచరులకు 25 మందికి దేశ సంపదను దోచిపెడుతున్నాడని, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ వాళ్ళకు అప్పజేప్పే పనిలో హిందూ మతాన్ని వాడుతున్నాడని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్తో ఎన్నికల పోత్తు కుదుర్చుకున్నంత మాత్రాన ప్రజా సమస్యల పరిష్కరించకపోతే, ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మిత్రుతోనైనా పోరాటానికి సిద్ధంగా ఉ ంటామని, ప్రజా సంక్షేమమే సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని, ఇల్లు జాగా లేని పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు భూ పోరాటాలు ఆగవని ప్రభుత్వం తక్షణమే వీటి పైన ఆలోచన చేయాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 50 మందిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో..రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ సిపిఐ పార్టీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, వేణుగోపాల చారి, మల్లయ్య గౌడ్ ఉప్పలయ్య, జమీల, భరత్, గోపి, పాపయ్య, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా బండి సంజయ్ "హోం" బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధత్యలుస్వీకరించారు. సరిగ్గా 11 గంటలకు నార్త్ బ్లాక్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. పదవీ బాధ్యతల కార్యక్రమానికి హాజరై వేద మంత్రోఛ్ఛరణలతో బండి సంజయ్ కు జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ ఆశిస్సులు అందచేసారు. బండి సంజయ్ కు సహచర మంత్రి నిత్యానంద రాయ్ పూల బొకే అందించి అభినందనలు తెలిపారు. భద్రతా కారణాల రీత్యా కార్యకర్తల అట్టహాసం, నాయకుల సందడి లేకుండా అత్యంత నిరాడంబరంగా అయన బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు తన అధికారిక నివాసంలో బండి సంజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ నుండి భారీగా తరలివచ్చారు. పూలబొకేలు, శాలువాతో సత్కరించి స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారరు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సాధారణ ప్రజల రాకతో బండి సంజయ్ నివాసం. కోలాహలంగా మారింది.

# మంత్రులకు శిక్షణ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

అమరావతి–ప్రభాత సూర్యుడు

ఏపీ రోజువారీ కార్యకలాపాల్లో మంత్రులకుసహకరించేందుకు ఎంబీఏ అర్హత కలిగిన వారిని నియమిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. వారితో భేటీలో మాట్లాడుతూ. శాఖల్లో ఫైళ్లను ఎలా నిర్వహించాలి.? ఏం చేయాలి.? ఏంచేయకూడదు.? అనే అంశాలపై మంత్రులకు శిక్షణ ఇప్పిస్తాం, అని తెలిపారు. ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత సంతకాలు చేయాలని, ఎలాంటి పొరపాట్లు చేయొద్దని సూచించారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST / HYDERABAD CITY,TELANGANA.**EDITOR: CHERUKU UPENDAR**
PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. **EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215**